క్లుప్తంగా

వైభవంగా శివపార్వతుల గ్రామోత్సవం

చెన్నూరు : మండలంలోని శివాలపల్లె గ్రామంలో శివపార్వతుల గ్రామోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసం ముగింపు సందర్భంగా గ్రామ సమీపంలోని శ్రీ కాశీవిశ్వనాథస్వామి ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్లారు. నెల్లూరు వారి కోలాటం ఆకట్టుకుంది. సోమవారం రాత్రి ప్రారంభమైన గ్రామోత్సవం మంగళవారం ఉదయం 10 గంటలకు ముగిసింది.

ఎమ్మెల్యే నివాళి

పెండ్లిమర్రి : మండలంలోని తుమ్మలూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ గృహసారథి సుబ్బరామ్ తమ్ముడు సుబ్రమణ్యం(28) సోమవారం మృతి చెందాడు. విషయం తెలిసిన ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తుమ్మలూరులో మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనువాసులు, మాజీ సర్పంచ్ రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

సేవాభావం కలిగి ఉండాలి



విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్న సునీల్‌రెడ్డి

కమలాపురం : ప్రతి ఒక్కరు విద్యార్థి దశ నుంచే సేవాభావం కలిగి ఉండాలని ఎంఈఓ-2 సుభాషిణి తెలిపారు. మంగళవారం పట్టణంలోని బీడీ కాలనీ ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు మాజీ ఎంపీటీసీ వల్లెల సునీల్‌రెడ్డి తన మిత్రుడు ఎన్ఆర్ఐ కోడూరు రాజేంద్రారెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని వితరణ చేసిన విద్యా సామగ్రిని ఎంఈఓ అందజేశారు. అలాగే విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉండే విద్యార్థులంతా పేద విద్యార్థులేనని వారికి ఇలా దాతలు సహకరించడం హర్షణీయం అన్నారు. విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. అలాగే విద్యార్థులు కూడా దాతలను ఆదర్శంగా తీసుకుని మీరు ఉన్నత స్థానాల్లో స్థిర పడ్డాక ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం జయమ్మ, ఉపాధ్యాయులు ముద్దం రామ్‌ప్రసాద్, సుబ్బరాజు, ఎస్తేరు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్కును ప్రారంభించాలని వినతి



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న చేనేత సంఘం నాయకులు

జమ్మలమడుగు : చేనేతల కల అయిన టెక్స్‌టైల్ పార్కును ప్రభుత్వం త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శివనారాయణ మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ జి.శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేనేతలు ఎక్కువగా ఉన్న నియోజకవర్గమైన జమ్మలమడుగు ప్రాంతంలో టెక్స్‌టైల్ పార్కు నిర్మాణం చేస్తామని హామీఇచ్చి దానిని మైలవరం మండలం కేంద్రంలో నెలకొల్పారు. ప్రస్తుతం టెక్స్‌టైల్ పార్కులో నిర్మాణాలు జరిగినా వాటిని అందుబాటులోనికి తీసుకురాకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. వెంటనే అధికారులు జోక్యం చేసుకుని టెక్స్‌టైల్ పార్కును వీలైనంత త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ముస్లిం మైనార్టీలను విస్మరిస్తున్న బీజేపీ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలను విస్మరిస్తోందని ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు కేసి బాదుల్లా పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఆయన మాట్లాడుతూ జమ్ము కాశ్మీర్ పై ఆర్టికల్ 370పై కోర్టు తీర్పు ముస్లిం మైనారిటీలను కలవరపాటుకు గురిచేస్తున్నాయన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలంగాణ ఎన్నికల్లో ముస్లింలకు ఇచ్చిన రిజర్వేషన్లు రద్దు చేస్తామని బహిరంగంగా ప్రకటించడం దారుణం అన్నారు.

మాతృ మరణాలకు అడ్డుకట్ట వేయాలి

కడప రూరల్ : మాతృ మరణాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. మంగళవారం స్థానిక ఆ శాఖ కార్యాలయంలోని ఛాంబర్‌లో దువ్వూరు, కామనూరు, కలసపాడు, వనిపెంట, కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో సంభవించిన మాతృ మరణాలపై వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ మాతృ మరణాల నివారణకు ప్రభుత్వం గట్టి చర్యలు చేపడుతోందని తెలిపారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి, గైనకాలజిస్ట్ హెచ్ఓడీ డాక్టర్ లక్ష్మీ సుశీల, వివిధ విభాగాలకు చెందిన వైద్యులు రాఘవేంద్రప్రసాద్, శివప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు జగనన్నతోనే సాధ్యం



మైలవరం : వేపరాలలో సంక్షేమపథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



వేంపల్లె : సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, తదితరులు

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మైలవరం మండలంలోని వేపరాల గ్రామంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని మండల ఎంపీపీ చేరెడ్డి సావిత్రితో కలసి ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమపాలనతో గడచిన 4 సంవత్సరాల కాలంలో అన్ని వర్గాల కుటుంబాలకు జగనన్న అండగా నిలిచారన్నారు. గతంలో ఎన్నడులేని విధంగా సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చి ప్రజల ఇంటి ముంగిటికే సంక్షేమ పథకాలు అందిస్తున్నాడన్నారు. గతంలో సమస్యలు ఉంటే ప్రజలు పట్టణాలకు వచ్చి కార్యాలయాల చుట్టూ తిరిగేవారన్నారు. నేడు తమ గ్రామాల్లోనే సమస్యలు పరిష్కరం అవుతున్నాయన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో కంటే మైలవరం మండలంలో దాదాపు 1950 మంది చేనేత కార్మికులు ఉన్నారని గ్రహించి అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి 'నేతన్న నేస్తం పథకం' కింద ప్రతి ఏడాది రూ.24 వేలు జగనన్న నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో వేస్తున్నాడన్నారు. ప్రజలు తిరిగి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకోవాలన్నారు. తెలుగుదేశం పార్టీకి వేసే ప్రతి ఓటు నిరుపయోగం అన్నారు. అనంతరం జెండాను ఎగురవేసి, జగనన్న అమలు పరచిన పథకాల బోర్డును ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ రమణారెడ్డి ఎంపీటీసీలు అలిశెట్టి కుమార్, శ్రావణి, ఎంపీడీఓ రామచంద్రారెడ్డి మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు గుర్విరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు విష్ణు, వినయ్, సుంకిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : వచ్చే ఎన్నికల్లో మళ్లీ రెండవ సారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, ఏపీఐఐసీ డైరెక్టర్ చంద్రఓబుళరెడ్డి, ఎంపీపీ లక్ష్మీగాయత్రిలు తెలిపారు. మంగళవారం స్థానిక వేంపల్లెలోని 7వ సచివాలయంలో ఏపీకి జగనన్నే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సముచిత గౌరవమిచ్చిందన్నారు. పేదలకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు తొలి రోజు నంచి అడుగులు పడుతున్నాయన్నారు. అర్హతే ప్రామాణికంగా పేదల గడపలకు సంక్షేమం పరుగులు తీస్తోందని.. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే పథకాలను తీసుకొస్తున్నారన్నారు. సామాజిక న్యాయం పాటిస్తూ, రాజకీయ ఉన్నతికి తోడ్పాటునందించిన ఏకైక సర్కార్ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు పాలనలో అవినీతి, లంచాలతో జన్మభూమి కమిటీలతో మోసపూరిత వాగ్దానాలు, ఇంటికో ఉద్యోగమంటూ నిరుద్యోగ యువతను, పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, మహాలక్ష్మి పథకం అమలు నుంచి మహిళలు రుణమాఫీ వరకు మోసం చేశారని, మరోసారి ప్రజలను మోసగించేందుకు వస్తున్నారని.. ఆయన మాటలు విని మళ్లీ ప్రజలు మోసపోవద్దని తెలిపారు. 7వ సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందిన రూ.26.93కోట్ల వివరాల బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మల్లికార్జునరెడ్డి, ఎంపీటీసీ భారతి, వార్డు మెంబర్లు ఆంజనేయులు, గణేష్, సచివాలయ కన్వీనర్లు ప్రసాద్‌బాబు, రమేష్‌బాబు, ఎస్సీ సెల్ కన్వీనర్ కమతం రాజ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు మడక రామాంజి, పుల్లగూర శ్రీను, సిద్ధారెడ్డి, సుధాకర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

వల్లూరు : మండలంలోని తోల్లగంగనపల్లె, తప్పెట్ల గ్రామాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న భూ రక్ష మరియు భూ హక్కు పథకం కింద భూములకు సంబంధించిన రీ సర్వే జరుగుతోందని తహసీల్దార్ శంకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా రైతులకు వారి సమక్షంలో వారికి సంబంధించిన హద్దులను చూపించడం జరుగుతుందన్నారు. తోల్లగంగనపల్లె, తప్పెట్ల గ్రామాల పరిధిలో భూములు కలిగి భూ యాజమాన్య హక్కులు గల రైతులు సంబంధిత గ్రామ సచివాలయాలకు వచ్చి గ్రామ సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించాలని తెలిపారు.

సీనియారిటీ జాబితాలో చోటు కల్పించాలి

కడప రూరల్ : ఎల్‌హెచ్‌వీ ట్రెనింగ్ పూర్తి చేసిన ఏఎన్ఎంలకు సీనియారిటీ జాబితాలో చోటు కల్పించాలని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు కోరారు. మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారికి వినతి పత్రం సమర్పించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 85 మంది ఏఎన్ఎంలు ఎల్‌హెచ్‌వీ ట్రెనింగ్‌ను పూర్తి చేశారన్నారు. వారికి సీనియారిటీ జాబితాలో చోటు కల్పించాలని తెలిపారు.

డిమాండ్లను పరిష్కరించాలని నిరసన



నిరసన తెలుపుతున్న ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు, తదితరులు

పులివెందుల టౌన్ : తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆర్టీసీ ఎన్ఎంయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.వి.రమణారెడ్డి, వై.శ్రీనివాసరావులు తెలిపారు. మంగళవారం స్థానిక నూతన ఆర్టీసీ గ్యారేజీ ఎదుట నేషనల్ మజ్దూర్ యూనియన్ సభ్యులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోలు, యూనిట్లు, నానాపరేషన్ యూనిట్లలో రెండు రోజులు డిమాండ్ల సాధన కోసం విరామ సమయాలలో నిరసన చేపట్టాలన్నారు. ఈపీఎఫ్ 95, సీపీఎస్‌పై ఆప్షన్ నిలుపుదల చేసి ఉద్యోగి ఎప్పుడైనా ఆప్షన్‌ను ఇచ్చుకునే వెసులుబాటు కల్పించాలన్నారు. ఆర్‌పీఎస్ 2017 అరియర్స్ ఉద్యోగులందరికి ఒకేసారి చెల్లించి తద్వారా ఈపీఎఫ్‌కు 95కు చెల్లింపులు చేసుకుని హయర్ పెన్షన్ పొందేందుకు ఏర్పాటు చేయాలన్నారు. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న ఆపిల్స్‌ను సానుకూలంగా పరిష్కరించాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ నుంచి మినహాయింపు చేసి సంస్థలో ఇదివరకే ఉన్న పరిమితిలేని వైద్యాన్ని కొనసాగించాలన్నారు. మెడికల్ లీవ్‌లో ఉన్న ఉద్యోగులందరికి ప్రభుత్వ నిబంధనల మేరకు వేతనం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ జీవో ప్రకారం మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవు వారు అడిగినప్పుడు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్యారేజీలలో ఖాళీలను ప్రమోషన్ల ద్వారా రిక్రూట్‌మెంట్ ద్వారా బర్తీ చేయాలన్నారు. గ్యారేజీ ఉద్యోగులకు స్పెషల్ టూల్స్ అవసరమైన మెటీరియల్ సకాలంలో ఇప్పించాలని తదితర డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అన్నిస్థాయి కమిటీల నాయకులు, ఆర్టీసీ యూనియన్ల నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయానికి కంప్యూటర్ల అందజేత



సచివాలయానికి పరికరాలను అందిస్తున్న డీజీఎం సుమన్ సర్కార్, తదితరులు

వేముల : మండలంలోని ముబ్బుచింతలపల్లె సచివాలయానికి సీఎస్ఆర్ కింద రూ.6.50 లక్షల విలువైన పరికరాలను అందజేశారు. డీజీఎం సుమన్ సర్కార్ ఫర్నీచర్, కంప్యూటర్లను గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శివశంకర్‌రెడ్డికి అందించారు. ప్రాజెక్టు పరిధిలో గ్రామం కావడంతో సీఎస్ఆర్ కింద అభివృద్ధిలో భాగంగా సచివాలయానికి అవసరైన పరికరాలను అందించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మైన్స్ ఏజెంట్ కిశోర్ భగవత్, చీఫ్ మేనేజర్ సంజయ్ చటర్జీ, అసిస్టెంట్ మేనేజర్ తారకేశ్వరరావు, సీఎస్ఆర్ ఇన్‌చార్జి నవీన్ కుమార్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీ నారాయణస్వామి నాయక్, డిజిటల్ అసిస్టెంట్ రామాంజి, సీఎస్ఆర్ కో ఆర్డినేటర్ గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లుగా నమోదు కావడం పౌరుల విధి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

జమ్మలమడుగు : 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు తప్పని సరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఆర్డీఓ జి.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఓటర్ల నమోదుపై ఆయన వివిధ రాజకీయ పార్టీలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఓటర్లుగా నమోదు కావడం భారతదేశంలో ఉన్న ప్రతి పౌరుడు విధిగా భావించాలన్నారు. ఓటు హక్కులేని వారు మరణించిన వారితో సమానం అన్నారు. ఓటర్లు తమ ఓటుతో నచ్చిన నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు కచ్చితంగా ఓటర్లుగా నమోదు చేసుకుని పల్లెప్రాంతాలలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజి విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ షఫి, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయండి



యూజీడీ, మినరల్ వాటర్ పైపులైన్ పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి

వేంపల్లె : మండలంలోని పలు అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన పట్టణంలోని యూజీడీ, మినరల్ వాటర్ పైపులైన్ పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. మండలంలో చాలావరకు అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నందున ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని.. వెంటనే వాటిని పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు. ముఖ్యంగా పులివెందుల-కడప, గండి రోడ్లలో రోడ్డు వెడల్పు చేస్తున్నందున కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయని ప్రజలు సహకరించాలని కోరారు. ఆరు నెలల్లోపు పనులన్ని పూర్తి చేసి వేంపల్లెను సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మేఘ కంపెనీ ప్రాజెక్టు మేనేజర్ సోమేశ్వరరావు, ఎంపీటీసీ భారతి, వార్డు మెంబర్ ముత్యాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



పులివెందుల ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్



జమ్మలమడుగులో ధర్నా చేస్తున్న మహిళలకు సంఘీభావం ప్రకటిస్తున్న సీపీఐ నాయకులు

పులివెందుల టౌన్ : అంగన్‌వాడీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకురాళ్లు నిరసన తెలిపారు. మంగళవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట సీఐటీయూ అనుబంధ సంఘం, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు పద్మావతి, ప్రధాన కార్యదర్శి సలీమాలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పిల్లల అభివృద్ధి పథకానికి తగినన్ని నిధులు కేటాయించకపోవడంతో ఇంకా పిల్లలలో పౌష్టికాహార లోపంతో ఉన్నారన్నారు. గత నాలుగేళ్లగా నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నా వేతనాలు పెంచడంలేదన్నారు. అంగన్‌వాడీ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్త సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్‌లు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మంజుల, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, రాణి తెలిపారు. మంగళవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ, సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీని అమలు చేయాలన్నారు. అర్హులైన సిబ్బందికి ప్రమోషన్స్ ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏలను తక్షణం విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ నాయకులు భాగ్యలక్ష్మీ, లక్ష్మీదేవిలు తెలిపారు. మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట వారు నిరసన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆగస్టు 1వ తేదీ నుంచి గర్భిణులకు, బాలింతలకు అమలు చేస్తున్న ఫేస్ యాప్‌ను రద్దుచేయాలన్నారు. అంగన్‌వాడీ విద్యను బలోపేతం చేసి పిల్లలకు యూనిఫాం, అమ్మ ఒడి అమలు చేయాలన్నారు. వేతనాలు ఇకపై తెలంగాణలో ఇస్తున్న దానికంటే ఎక్కువగా పెంచాలని, మిని అంగన్‌వాడీ సెంటర్‌లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్ చేశారు. విధులలో ఉండి చనిపోతే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర వారికి సంఘీభావం ప్రకటించారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న వర్కర్స్, హెల్పర్స్‌ల సమస్యలను పరిష్కరించాలని సిబ్బంది మంగళవారం స్థానిక ఐసీడీయస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. 4 రోడ్ల కూడలి నుంచి పాతబస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని, సమస్యల పరిష్కారం కోసం సమ్మె నోటీసు ఇచ్చామని, మొత్తం 11 డిమాండ్లతో ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేసినట్లు అంగన్‌వాడీ వర్కర్స్ నాయకులు తెలిపారు.


ప్రారంభమైన అధ్యయనోత్సవాలు



ఆరాధన ఉత్సవం సందర్భంగా స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు మంగళవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. తిరుమల-తిరుపతి దేవస్థానాల పరిధిలోని ఈ ఆలయంలో ధనుర్మాసం ప్రారంభ సూచికంగా ఈ అధ్యయనోత్సవాలను వారం రోజులపాటు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తొలిరోజు పగలు పత్తు ఉత్సవం, ప్రత్యేక తిరుచ్చి వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. ఈ సందర్భంగా తిరుమంగై ఆళ్వార్‌ను కొలువుదీర్చి విశేష అలంకారం చేసి మంగళ వాయిద్యాల మధ్య ఆలయ ప్రాకారం ఉత్సవం నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్ రెడ్డి, అర్చకులు కృష్ణ మోహన్, ఆలయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.


సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలి



ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు

కడప కార్పొరేషన్ : ఎనర్జీ అసిస్టెంట్లను సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలని గ్రామ, వార్డు సచివాలయం ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు కోరారు. మంగళవారం కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె. మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ సచివాలయ ఉన్నతాధికారులు 18 శాఖల ఉద్యోగుల పనితీరును పర్యవేక్షిస్తూ వారి సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరిస్తున్నారన్నారు. కాగా ఒక్క ఎనర్జీ సెక్రటరీలను మాత్రం విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు సత్తార్, కుళ్లాయప్ప, మల్లికార్జున, శ్రీనివాసులరెడ్డి, నాగేంద్ర, శివ, ఓంకార్, హాజీ బాషా పాల్గొన్నారు.

గ్రామీణ తపాలా శాఖ ఉద్యోగుల నిరవధిక సమ్మె



పులివెందులలో మాట్లాడుతున్న ప్రొద్దుటూరు డివిజన్ అధ్యక్షుడు కె.సి.రాముడు

పులివెందుల టౌన్ : దేశ వ్యాప్తంగా గ్రామీణ తపాలా శాఖ ఉద్యోగులు తమ సమస్యల డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మె చేపట్టారు. మంగళవారం స్థానిక తపాల శాఖ ప్రధాన కార్యాలయం ఎదుట ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ ప్రొద్దుటూరు డివిజన్ అధ్యక్షుడు కె.సి.రాముడు ఆధ్వర్యంలో గ్రామీణ తపాలా శాఖ ఉద్యోగులు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ తపాలా శాఖ ఉద్యోగులు 8 ప్రధాన డిమాండ్లతో నేటి నుంచి వారం రోజులపాటు నిరవధిక సమ్మె చేపడుతున్నారన్నారు. ప్రధాన డిమాండ్లను ప్రతి జీడీఎస్‌కి సివిల్ సర్వెంట్ హోదా కల్పించి 8 గంటల పనిభారాన్ని కల్పించాలన్నారు. సీనియర్ జీడీఎస్‌లకు సర్వీస్ పూర్తయిన వారికి అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలి, అలాగే గ్రూప్ ఇన్సూరెన్స్, గ్రాంట్యుటీని రూ.5 లక్షలకు పెంచాలన్నారు. ఎస్‌డీబీఎస్, జీడీఎస్ కాంట్రిబ్యూషన్ 10 శాతం మరియు డిపార్ట్‌మెంట్ 10 శాతంగా నిర్ధారించి తాత్కాలిక పెన్షన్ ఇవ్వాలన్నారు. రెగ్యులర్ జీడీఎస్‌లు పెట్టినప్పుడు వర్క్ లోడుతో సంబంధం లేకుండా సబ్‌స్టిట్యూట్‌ని అనుమతించాలన్నారు. కమిటీలో అమలు కానీ అన్ని అంశాలను అమలు చేయాలన్నారు. టార్గెట్, మేళాల రూపంలో జీడీఎస్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న అన్ని రకాల వేధింపులను ఆపేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ దేశవ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగా గ్రామీణ తపాలా ఉద్యోగులు తమ డిమాండ్లను పరిష్కరించాలని మంగళవారం స్థానిక పోస్టాఫీసు ముందు నిరసన వ్యక్తం చేశారు. సివిల్ సర్వెంట్ హోదా, పనిభారాన్ని తగ్గించాలని, సీనియర్ జీడీఎస్‌లకు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని సిబ్బంది కోరారు. గ్రూప్ ఇన్సూరెన్స్, గ్రాట్యుటీని రూ.5 లక్షలకు పెంచాలని, 7వ తేదీన కమిటీలో అమలుకాని అన్ని అంశాలను వెంటనే అమలు చేయాలని, జీడీఎస్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న అన్ని రకాల వేధింపులను ఆపివేయాలని గ్రామీణ తపాల ఉద్యోగులు డిమాండ్ చేశారు. జీడీఎస్‌లు నిరసన వ్యక్తం చేశారు.